విశాలాంధ్ర గుంటూరు జిల్లా

శ్రీలక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే ధూళిపాళ్ల

విశాలాంధ్ర-మంగళగిరి : శ్రీలక్ష్మీ నరసింహ స్వామివారిని దర్శించుకున్న పొన్నూరు ఎమ్మె ల్యే ధూళిపాళ్ల నరేంద్ర ఆది వారం మంగళగిరి శ్రీ లక్ష్మీనర సింహస్వామి వారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి ధూళిపాళ్ల నరేంద్రకు ఘన స్వాగతం పలికారు. టీడీపీ సీనియర్ నాయకులు సంకా బాలాజీ గుప్తా ఉన్నారు.

జనసేన మహిళలు, నాయకుల పాదయాత్ర

విశాలాంధ్ర-మంగళగిరి : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పిఠాపు రంలో భారీ మెజారిటీతో విజయం సాధించిన సందర్భంగా ఆదివారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి వీర మహిళలు, జనసేన నాయకులు ఆదివారం పాదయాత్ర చేపట్టారు. పిఠాపురంలో పవన్ కళ్యాణ్ విజయం సాధించడంతో జనసేన కేంద్ర కార్యాలయం నుంచి విజయవాడ ఇంద్ర కీలాద్రి అమ్మవారి దేవస్థానం వరకు పాదయాత్రగా వెళ్ళి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకోనున్నారు. ముందుగా జనసేన కేంద్ర కార్యలయం నుంచి జనసేన నేత చిల్లపల్లి శ్రీనివాసరావు జెండా ఊపి ప్రారంభించారు.

పెసరలంక వసంత దుర్గకి 'నాట్యేశ్వర' బిరుదు

విశాలాంధ్ర-తెనాలి : తెనాలి ఐతానగర్ శ్రీ లక్ష్మీ నారాయణ కూచిపూడి నృత్య కళానికేతన్ పెసర్లంక వసంత దుర్గ శిష్య బృందం చే ఆదివారం అమరా వతి శ్రీ అమరేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణం నందు నృత్య మహోత్సవం కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాధా మాధవ పాల్గొన్నారు. రసరంజని వ్యవస్థాపక కార్యదర్శి షేక్ ఖలీల్ ఆధ్వర్యంలో గురువు పెసరలంక వసంత దుర్గకి 'నాట్యేశ్వర' బిరుదుతో సత్కరించి, శిష్యులైన భువన తేజ, తేజస్విని, అందేతన్మయి, నిత్యని హేరా, దీపిక, చైత్ర, కృతిక, ధన్విత, రోషిత, సాత్వికలను నాట్యాంబ బిరుదులతో సత్కరించి, ప్రశంసా పత్రములను అందించారు. ఈ కార్యక్రమంలో అందే బాల చంద్రమౌళి, రాజేశ్వరి, అనిత, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఆవిష్కరణ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : నరేంద్ర మోడీ మూడవసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేయిస్తున్న సందర్భంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 5వ మండలం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి తూర్పు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ డాక్టర్ ఉమా శంకర్, కో-కన్వీనర్ షేక్.రఫీలు ముఖ్య అతిధిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో ఎన్డీయే కూటమి అధికారంలోకి రావటం చంద్రబాబు లాంటి విజన్ ఉన్న నాయకుడు ముఖ్యమంత్రి కావడం చాలా గర్వించదగ్గ విషయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎన్వీ నరేష్, సురేష్, వెంకట ప్పయ్య, వెంకటేశ్వరరావు, సాంబశివరావు, చంద్రశేఖర్, వెంకయ్య, లక్ష్మీనారాయణ, వికాస్, నాగేశ్వరరావు, శంకర్, ఆంజనేయులు, బాలయ్య, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

నికల్ టాక్సీకాలజీ అంశపై సదస్సు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి మండలం చిన్న కాకాని గ్రామంలోని ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజ్ అండ్ జనరల్ హాస్పిటల్ లోని ధన్వంతరి లెక్చర్ గ్యాలరీలో ఎమర్జెన్సీ మెడిసిన్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో క్లినికల్ టాక్సికాలజీ అనే అంశంపై శనివారం, ఆదివారం పాటు జాతీయ సదస్సును విజయవంతంగా నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొనేందుకు దేశ నలుమూలల నుండి దాదాపు మూడు వందల మంది వైద్యులు వచ్చినట్లు నిర్వాహకులు డాక్టర్ ప్రణవ్ తెలిపారు. ముఖ్య అతిథులుగా ఐయస్సీటీ ప్రెసిడెంట్ డాక్టర్ నరేంద్రనాథ్, ఏఎస్ఎంటీ ప్రెసిడెంట్ డాక్టర్ సెంథిల్ కుమారన్ పాల్గొని క్లినికల్ టాక్సికాలజీ ప్రాముఖ్యతపై అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. పాయిజన్ కేసులను ట్రీట్ చేసే విధానాలను, ప్రసూతి కాన్పుల సమయంలో తీసుకోవాల్సిన మెలుకొవలు గురించి, వెంటిలేటర్ పై అందించే చికిత్స విధానాలు లాంటి వివిధ అంశాలపై దాదాపు 20మంది పైగా ఫ్యాకల్టీ వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ లక్ష్మీ, ప్రిన్సిపాల్ డాక్టర్ శివ ప్రబోధ్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ చౌదరి ఎగ్జిక్యూటివ్ సెక్రెటరీ వేంకటేశ్వరరావు, ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సురేంద్ర, డాక్టర్ ప్రణవ్, డాక్టర్ అశోక్ రెడ్డి, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ చరిత, డాక్టర్ వీరేష్ ఎమర్జెన్సీ విభాగ సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ ఆవిష్కరించిన స్థూపం ధ్వంసం

విశాలాంధ్ర-మంగళగిరి : అమరావతి ప్రాంతంలో జగన్ పేదలకు సెంటు స్థలా లను కేటాయించారు. ఆ సమయంలో కృష్ణాయపాలెం శివారులో శంకుస్థాపన చేసి నమూనా ఇంటితో పాటు, స్థూపాన్ని ఏర్పాటు చేశారు. అయితే కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఏర్పాటు చేసిన స్థూపాన్ని, శిలాఫల కాన్ని జేసీబీతో ధ్వంసం చేశారు. ఈ ఘటనపై వైసీపీ నాయకులు తీవ్రంగా మండిపడుతున్నారు. ప్రమాణ స్వీకారం కాకుండానే వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలు, శంకుస్థాపన చేసిన శిలా ఫలకాలను తొలగిస్తున్నారని, కక్షపూరితంగా వ్యవహరిసు న్నారని వైసీపీ నాయకులు మండిపడ్డారు. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నాయకులు కోరారు.

పోరాటాలకు..త్యాగాలకు పుట్టినిల్లు ఎస్టీయూ

◆ ఘనంగా ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-గుంటూరు : పోరాటాలకు..త్యాగాలకు పుట్టినిల్లు ఎస్టీయూ (రాష్ట్రోపాధ్యాయ సంఘం) అని ఏఐఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శి సీహెచ్.జోసఫ్ సుధీర్‌బాబు కొనియాడారు. గుంటూరులోని కంకరగుంటలో ఉన్న ఎస్టీయూ భవన్ నందు ఎస్టీయూ 78వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోసఫ్ సుధీర్‌బాబు జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వమే నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన సమరంలో బానిస సంకెళ్లను బద్దలుకొట్టి 17 మే 1946న ఆవిర్భవించి, జూన్ 9, 1947వ సంవత్సరం నుంచి అధికారిక గుర్తింపు పొందిన తొలి ఉపాధ్యాయ సంఘం రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూఏపీ) అని అన్నారు. 1963 నుంచి ఏపీ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్లో వ్యవస్థా పక శాశ్వత సభ్య సంఘం ఎస్టీయూ అని, గత 77 సంవత్సరాలుగా నిరంతరం ఉద్యమ స్ఫూర్తితో ప్రగతి పథంలో పయనిస్తుందన్నారు. ఉపాధ్యాయుల అనేక సమస్యల పరిష్కారంలోను.. ఉపాధ్యాయులకు వివిధ సౌకర్యాలు కల్పించడంలోనూ ప్రభుత్వంతో పోరాడి సాధించటంలో విశేష కృషి చేసిన సంఘం అని పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో నిరంతరం శ్రమిస్తూ ముందుంటుందన్నారు. సంఘం ఉద్యమ నేతలు దివంగత మగ్దుం మొహిద్దిన్, పీవీ రాఘవాచారి, వీణా విజయరామరాజు, పి.శ్రీరామ మూర్తి తదితరుల త్యాగం మరువలేనిదని ప్రశంసించారు. క్రమ శిక్షణ కలిగిన కార్యకర్తలుగా పని చేస్తూ సంఘ పురోభివృద్ధికి పాటుబడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు డి. పెదబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, రాష్ట్ర ఉపాధ్య క్షులు వి.ప్రసాదరావు, రాష్ట్ర కౌన్సిలర్స్ షేక్ బాజీ, డీఏ జోసఫ్, ఆర్థిక కార్యదర్శి ఎల్. వీరాంజ నేయులు, జిల్లా సీనియర్ నాయకులు పి. శ్రీనివాసరావు, పి.ప్రసాద్, రాజేష్, సుందరం, ఎంపీ సుబ్బారావు, దేవిడ్‌రాజు, ఎం. శ్రీనివాసరావు, కృష్ణ కిషోర్, జె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టణ రంగస్థల కళాకారుల సంఘ కార్యవర్గం ఏకగ్రీవం

విశాలాంధ్ర- తెనాలి : పట్టణ రంగస్థల కళాకారుల సంఘం సర్వసభ్య సమావేశం స్థానిక బుర్రిపాలెంరోడ్డు బీసీ కాలనీలోని సంఘ భవనంలో ఆదివారం ఉదయం సంఘ మాజీ ప్రధాన కార్యదర్శి గరికపాటి సుబ్బారావు అధ్యక్షతన జరిగింది. గత కార్యవర్గం పదవీకాలం అయిదు సంవత్సరాలు ముగియడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్నట్లు సంఘంలోని మాజీ కార్యవర్గ సభ్యులు కొందరు ప్రకటించారు. ఎన్నికలు జరపడం వల్ల డబ్బు చాలా ఖర్చు జరుగుతుం దని, ఏకగ్రీవంగా ఎన్నికోవడం వల్ల ఆ ధనాన్ని కళాకారుల సంక్షేమానికి ఉపయోగించవచ్చని ముఖ్య అతిథిగా పాల్గొన్న సినీ మాటల రచయిత డాక్టర్ సాయి మాధవ్ బుర్రా సూచించారు. ఎన్నికల అధికారిగా కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ డి. ఎల్. కాంతారావు వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని అప్పటికప్పుడే ప్రకటించి ప్రమాణ స్వీకారం చేశారు.

నూతన కార్యవర్గం వివరాలు: నూతనంగా ఎంపికైన కార్యవర్గం శ్రీమతి బుజ్జా జయలక్ష్మి (అధ్యక్షులు), ఆరాధ్యుల కోటేశ్వరరావు (గౌరవ అధ్యక్షుడు), గరికపాటి సుబ్బారావు (కార్యనిర్వాహక అధ్యక్షుడు), ఆరాధ్యుల ఆదినారాయణరావు (ప్రధాన కార్యదర్శి), ఎం. రామలింగేశ్వరరావు (కార్యనిర్వాహక కార్యదర్శి), దీపాల సుబ్రహ్మణ్యం (కొశాధికారి), ఉపాధ్యక్షులుగా శ్రీమతి బెజ్జంకి నాగమణి, శ్రీమతి నిర్మాలా రమేష్, పందిటి సుబ్బారావు, శరత్ వెంకయ్య, ముత్యాల లక్ష్మీ తులసి, సంయుక్త కార్యదర్శులుగా కనపర్తి మధుకర్, గోగినేని సుధీర్, మహబూబ్ సుభాని ఎంపిక కాగా కార్యవర్గ సభ్యులుగా బడుగు మోహనరావు, గోళ్ళ సుబ్రహ్మణ్యం, కొండమూది రమేష్, ఎస్.కె. షైదా, శ్రీమతి వేములవాడ సత్యవతి ఎంపికయ్యారు. క్రమశిక్షణా కమిటీ సభ్యులుగా డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, చెరుకుమల్లి సింగారావు, షేక్ జానిబాషా, న్యాయ సలహాదారుగా హరిదాసు గౌరీశంకర్, గౌరవ సలహాదారుగా ఉప్పాల రాజేశ్వరరావు, ఐనాల మల్లేశ్వరరావు, టి.వి.ఎస్. శాస్త్రి, కనపర్తి బాబురావు, గోగినేని కేశవరావు, బొల్లిముంత కృష్ణ, చిట్లూరి సీతారామయ్య ఏకగ్రీకంగా ఎన్నికయ్యారు. సాయి మాధవ్ బుర్రా మాట్లాడుతూ పట్టణ రంగస్థల సంఘ కళాకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం సాయశక్తులా కష్టపడి పనిచేస్తానని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో నన్నపనేని రాంబాబు, వినయ్ పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 ఫలితాల్లో సత్తా చాటిన భాష్యం

విశాలాంధ్ర-గుంటూరు : జేఈఈ అడ్వాన్స్‌డ్-2024 ఫలితాల్లో భాష్యం ఐఐటీ, జేఈఈ అకాడమీ ఆలిండియా అత్యుత్తమ ర్యాంకులతో సంచలనం సృష్టించిందని భాష్యం విద్యా సంస్థల చైర్మన్ రామ కృష్ణ తెలిపారు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో భాష్యం ఐఐటీ, జేఈఈ అకాడమీ విద్యార్థులు ఎం. సాయి యశ్వంత్‌రెడ్డి ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 50వ ర్యాంకు, ఎం.జిష్ణు సాయి ఓపెన్ కేటగిరిలో ఆలిండియా 62వ ర్యాంకు సాధించి జాతీయ స్థాయిలో విజయకేతనం ఎగురవేశరన్నారు. అలాగే వివిధ కేటగిరిల్లో ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి 5వ ర్యాంకు, పి.గౌతమి 19వ ర్యాంకు, కె.శ్రేయ 23వ ర్యాంకు, కె.జాషువా వివేక్ 26వ ర్యాంకు, జి.జాన్ 36వ ర్యాంకు, ఎం.అర్జున్ కుమార్ 37వ ర్యాంకు, కె.హర్షిత 43వ ర్యాంకు, కె.చైతన్య 52వ ర్యాంకు, పి.శ్యామ్ 61వ ర్యాంకు, డి.భరత్ చంద్ర 86వ ర్యాంకులతో పాటు ఆలిండియా 100లోపు 12 ర్యాంకులు, 200 లోపు 20 ర్యాంకులు, 500 లోపు 51 ర్యాంకులు, 1000 లోపు 86 ర్యాంకులు, 2000 లోపు 107 ర్యాంకులు, 5000 లోపు 193 ర్యాంకులు సాధించటంతో పాటు ఐఐటీ సెలెక్షన్స్‌లో ఆలిండియా ఆల్‌టైం ది బెస్ట్‌గా నిలిచినట్లు ఆయన పేర్కొన్నారు. ఓపెన్ కేటగిరిలో ఆలిం డియా 50, 62 ర్యాంకులను సాధిం చిన ఎం.సాయి యశ్వంత్‌రెడ్డి, ఎం.జిష్ణు సాయిలకు ఒక్కొక్కరికీ రూ.5లక్షల చొప్పున ఉన్నత చదువులు నిమిత్తం చైర్మన్ రామకృష్ణ నగదు ప్రోత్సాహక చెక్కులను అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులను భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావులు అభినందించారు.

రామోజీరావు మృతికి సంతాపం

విశాలాంధ్ర-గుంటూరు : ఈనాడు గ్రూప్ సంస్థల చైర్మన్ చెరుకూరి రామోజీ రావు అకాల మరణానికి చింతిస్తూ యోగా గురువు ఆళ్ల రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అరండల్‌పేటలోని జిల్లా టీడీపీ కార్యాలయంలో రామోజీరావు మృతికి సంతాపంగా యోగా సభ్యులు మూడు నిముషాలు మౌనం పాటించి వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు. యోగా గురువు ఆళ్ల రాజేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో లక్షల కుటుంబాలను ఉన్నతులుగా తీర్చిదిద్దిన రామోజీ గ్రూపు చైర్మన్ చెరుకూరి రామోజీరావు అకాల మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా సాంస్కృతిక విభాగం ప్రధానకార్యదర్శి కూనమనేని వెంకటరమణ, యోగా సభ్యులు ప్రసాద్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

సమర్ధన దివ్యాంగుల సంస్థ సహకారం అభినందనీయం

- బహుమతి ప్రధానోత్సవంలో ఎమ్మెల్యే గల్లా మాధవి

విశాలాంధ్ర-గుంటూరు : చెస్ అసోసియేషన్ ఫర్ విజువల్లి ఛాలెంజ్డ్ ఆంధ్రప్రదేశ్ ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఫర్ ది బ్లైండ్ వారి ఆధ్వర్యంలో గుంటూరు సమర్ధన దివ్యాంగుల సమస్త వారి సహకారంతో గుంటూరు హిందూ ఫార్మసీ కాలేజ్ నందు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన బహుమతి ప్రధానోత్సవం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గల్లా మాధవి, రామసేతు పెయింట్స్ అండ్ హార్డ్ వేర్ అధినేత పి సుధాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెక్రెటరీ సిహెచ్ కుమార్ రాజా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న ఎంపిక పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుండి 21 మంది క్రీడాకారులను తెలంగాణ నుండి పది మంది క్రీడాకారులను ఎంపిక చేసి త్వరలో ఆగస్టులో జరగనున్న సౌత్ జోన్ టోర్నమెంటుకు పంపించడం జరుగుతుందన్నారు. టోర్నమెంట్ జరగటానికి సహకారాన్ని అందించిన హిందూ ఫార్మసీ కాలేజ్, సమర్ధనా దివ్యాంగుల సంస్థ డాక్టర్ పరమహంసకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. దివ్యాంగులకు సంబంధించి అన్ని రకాలుగా తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ ప్రత్యేకంగా ట్రస్టును ఏర్పాటు చేసి దివ్యాంగుల పక్షాన నిలబడిన సమర్ధన దివ్యాంగుల సంస్థ సహకారం మరువలేనిదని అన్నారు. ఎమ్మెల్యే గల్లా మాధవి మాట్లాడుతూ జీవితంలో అన్ని సక్రమంగా ఉండి క్రమశిక్షణ లేకుండా జీవించే వారి కన్నా దేవుడు తమ జీవితంలో కొంత లోపాన్ని పెట్టినా కూడా క్రమశిక్షణతో పాటు తాము పూర్తిస్థాయి విజయాన్ని సాధించాలన్న విశ్వాసంతో చెస్ ఆడుతున్న వారిని చూడటం చాలా ఆశ్చర్యం కలిగించిందన్నారు. ముఖ్యంగా ఇటువంటి వారు జీవితంలో అత్యంత తెలివి కలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా సమర్ధన దివ్యాంగుల సంస్థ ద్వారా దివ్యాంగులకు సహాయ సహకారాలు అందిస్తూ వారి యొక్క ఎదుగుదలకు తోడ్పాటు అందించడమే కాకుండా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పన కూడా కృషి చేస్తున్న సమర్ధన దివ్యాంగుల సంస్థ సేవలను గల్లా మాధవి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సమర్ధన దివ్యాంగుల సంస్థ చైర్మన్ డాక్టర్ పరమహంస, రామసేతు పెయింట్స్ అధినేత పి సుధాకర్, చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, ట్రెజరర్ ఎం. ప్రసన్నకుమార్, ఆర్బిటర్‌గా గోపీనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రాజధాని భూములకు రెక్కలు

- బెంబేలెత్తుతున్న వ్యాపారులు

విశాలాంధ్ర-తాడికొండ : తెలుగుదేశం పార్టీ రెండవ సారి అధికారంలోకి రావటంతో రాజధాని అమరావతి పరిసర మండలాలలో భూముల ధరలు రూ. కోట్లకు చేరాయి. గత ఐదు, ఆరు మాసాల క్రితం రెండు కోట్ల విలువ చేయని భూముల ధరలు నేడు రూ.5 కోట్లకు చేరింది. రైతులు నోరు పట్టకుండా భూముల ధరలను అనూహ్యంగా పెంచుతున్న నేపథ్యంలో రైతులు చెప్పే ధరలకు రియల్ ఎస్టేట్ వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. కోట్ల రూపాయలకు భూములు కొని గజం ఎంతకు అమ్మాలంటు వాపోతున్నారు. గత ఐదు సంవత్సరాలుగా స్తబ్ధతగా ఉన్న భూముల ధరలు అనూహ్యంగా పెరిగాయి. ప్రధాన రహదారులు, డొంకల వెంట ఉన్న భూములకు డిమాండ్ పెరిగింది. భూముల అమ్మకాల విషయంలో రైతులు గంట గంటకు ధరలను మారుసున్నారు. ఎక్కువ మంది రైతులు నెల తర్వాత భూములను అమ్ముకుందామనే ఆలోచనలో ఉన్నారు. రాజధానిలో పనులు ప్రారంభమైన నేపథ్యంలో ప్లాట్లు, భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. పాత వెంచర్లకు డిమాండ్ పెరిగింది.

శిలాఫలకాలను ధ్వంసం చేస్తే తీవ్ర పరిణామాలు

- ఎన్టీఆర్ స్టేడిఎం పేరు మార్పు శిలా ఫలకాల కూల్చివేత
- ఎన్టీఆర్ జిమ్‌గా నామకరణం చేసిన బ్రాహ్మణ చైతన్య వేదిక

విశాలాంధ్ర-గుంటూరు : ఎవరైనా అన్న ఎన్టీఆర్‌ను టచ్ చేయాలని చూస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవల్సి ఉంటుందని ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ హెచ్చరించారు. నగరం నడిబొడ్డున అన్న నందమూరి తారక రామారావు పేరుతో ఎన్‌టీఆర్ స్టేడియంగా ఏర్పాటై ప్రతి రోజూ ఎంతో మందికి నడక, వ్యాయామంతో ఆరోగ్యాన్ని ప్రసాదిస్తూ నగర వాసుల దినచర్యలో భాగమైన ఎన్‌టీఆర్ స్టేడియం పేరు మార్చాలని వైసీపీ సైకోలు చేసిన కుట్రలను ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ చైతన్య వేదిక న్యాయ పోరాటం ద్వారా సమర్థవంతంగా తిప్పికొట్టడం జరిగింది. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సిరిపురపు శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఎన్టీఆర్ స్టేడియంలో ఉన్న వాకింగ్ ట్రాక్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు మధ్య దొడ్డిదారిన నిబంధనలకు విరుద్దంగా గుట్టుగా వైఛీపీ మూకలు ఏర్పాటు చేసిన శిలాఫలకాలను ధ్వంసం చేయడం జరిగింది. శిలాఫల కాల తొలగింపు కార్యక్రమంలో స్థానిక వాకింగ్ సభ్యులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు. ఆ తర్వాత ఆ నూతన భవనానికి ఎన్టీఆర్ జిమ్‌గా నామకరణం చేసి ఎన్టీఆర్ జిమ్ అనే పెద్ద అక్షరాలతో బిల్డింగ్ బయట బోర్డు అమర్చడం జరిగింది. తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు రావిపాటి సాయికృష్ణ మాట్లాడుతూలి వైయస్ జగన్మోహన్ రెడ్డి దురహంకారానికి ఇది నిదర్శనం ఆయనకు ప్రజలు ఎన్నుకున్నది కట్టడాలు కూల్చేయడానికి పేర్లు మార్చడానికేనా అని సాయి ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్చక సేవా సంఘం ప్రధాన కార్యదర్శి జంధ్యాల రామలింగేశ్వర శాస్త్రి, మాజీ తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కొమ్మినేని సాంబశివరావు, సవరం రోహిత్, నందివెలుగు చందు, కనపర్తి శ్రీనివాసరావు, నూతలపాటి గోపి తెలుగు యువత నరేష్ గుత్తికొండ శ్రీనివాస్, స్టీఆర్ వాకింగ్ ట్రాక్ సభ్యులు ఎన్టీఆర్ అభిమానులు వందలాదిగా పాల్గొన్నారు.

రామోజీరావు మృతి సినీ రంగానికి తీరని లోటు

- సేవా సదన్‌లో నివాళులర్పించిన పలువురు ప్రముఖులు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పద్మ విభూషణ్, ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత స్వర్గీయ చెరు కూరి రామోజీరావు లేని లోటు మీడియా రంగానికి..సినీ రంగా నికి తీరని లోటు అని పలువురు ప్రముఖులు కొనియాడారు. సేవా సదన్ సామాజిక సేవా సంస్థ, భారతీ సాంస్కృతి సంగీత కళావేదిక, గుంటూరు పార్లమెంటరీ కాపునాడు సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అమరావతి రోడ్డులో ఉన్న సేవా సదన కార్యాలయంలో స్వర్గీయ చెరుకూరి రామోజీరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు రామోజీరావు చేసిన గొప్ప సేవలను గుర్తు చేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఒక సామాన్య కుటుంబంలో జన్మించి ఉన్నత శిఖరాలకు ఎదిగిన వ్యక్తి చెరుకూరి రామోజీరావు అని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో సేవా సదన్ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియాల గోపి కుమార్, చిరంజీవి యువత కార్యనిర్వాహక అధ్యక్షులు మేకల రవీంద్రబాబు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనే యులు, కళాకారులు, గాయకులు మిరియాల ప్రసాదరావు, కావూరి సత్యనారా యణ, పెళ్లూరి కృష్ణారావు, కె.బాబురావు, పోతురాజు, సురేష్, వీర బ్రహ్మాచారి, పల్లంపాటి లలిత్ బాబు, తులసి అరుణ్ కుమార్ తదితర ఉన్నారు.

క్యాన్సర్‌కు నేడు అధునాతన చికిత్సా విధానాలు

- ఆంకాలజిస్ట్ డాక్టర్ సత్య శ్రీనివాస్

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ప్రస్తుతం సమాజంలో క్యాన్సర్ వ్యాధి విస్తృతంగా వ్యాపించిందని, దీనికి జన్యుపరమైన కారణాలు..మనం అనుసరిస్తున్న జీవన శైలి..కొంత మందిలో ఏ విధమైన చెడు అలవాట్లు లేకపోయినప్పటికీ వారికి జన్యుపరంగా క్యాన్సర్ వచ్చే అవకాశాలు ఉంటాయని, అయితే ఈ క్యాన్సర్‌కు నేడు అధునాతనమైన చికిత్సా విధానాలు అందుబాటులోకి వచ్చినట్లు ప్రముఖ ఆంకాలజిస్ట్ ఎ.సత్య శ్రీనివాస్ అన్నారు. స్థానిక అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం ఉదయం క్యాన్సర్‌కు గల కారణాలు..అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలు గురించి డాక్టర్ సత్య శ్రీనివాస్ తెలియజేశారు. అనంతరం డాక్టర్ సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ చాలామందిలో ధూమపానం, మద్యపానం, ప్యాసివ్ స్మోకింగ్, వివిధ రకాల రసాయనాలతో పండించిన కూరగాయలను, పండ్లను వినియోగించటం, వివిధ ఆహార పదార్థాలలో రుచుల కొరకు ఉపయోగించే అజానా మోటా లాంటి పదార్థాలు..వివిధ ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా కనపడటానికి ఉపయోగించే కలర్స్..కెమికల్స్ కలిపి తయారు చేసిన ఆహార ఉత్పత్తులను తినడం ద్వారా నేడు ఎక్కువ సంఖ్యలో క్యాన్సర్ బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించిన ఎడల 100శాతం నయం చేయడానికి చికిత్సలు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. అలా కాకుండా అడ్వాన్స్ దశలో గుర్తించిన ఎడల ఈ క్యాన్సర్‌ను నయం చేయటం కష్టతరమవుతుందన్నారు. అడ్వాన్స్ దశలో క్యాన్సర్‌ను గుర్తించిన వారికి..వారి లైఫ్‌స్పాన్ పొడిగించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. మనకు రెండు భాగాలకు సంబంధించిన క్యాన్సర్లకు వ్యాక్సిన్స్ అందుబాటులో ఉన్నాయని, అవి ఒకటి రంగుకు సంబంధించిన హెపటైటిస్ బి.వ్యాక్సిన్, రెండవది సర్వైకల్ క్యాన్సర్‌కు సంబంధించిన వ్యాక్సిన్ అని అన్నారు. ఈ రెండు రకాలకు తప్ప మన శరీరంలో వివిధ భాగాలకు సంభవించే క్యాన్సర్లకు వ్యాక్సిన్ లేదన్నారు. స్క్రీనింగ్ టెస్ట్‌ల ద్వారా కొన్ని సందర్భాల్లో క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించవచ్చని, ఈ స్క్రీనింగ్ టెస్ట్‌లలో 100శాతం తెలిసే అవకాశం ఉంటుందని చెప్పారు. జనరల్ చెకప్‌లలో ఏదైనా క్యాన్సర్‌కు సంబంధించిన లక్షణాలు కనపడిన తదుపరి పెట్ స్కాన్, బయాప్సీ లాంటి పరీక్షల ద్వారా క్యాన్సర్‌ను నిర్ధారించి తగు వైద్యం చేసే అవకాశం ఉంటుందన్నారు. ఒకసారి క్యాన్సర్‌ను నిర్ధారించిన తర్వాత దాని స్థితి, అది ఏ కోవకు చెందిన క్యాన్సరో పరిశీలించి..ఏ రకమైన వైద్యం చేయాలన్నది వైద్యులు నిర్ణయిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి కో-ఆర్డినేటర్‌గా టీవీ సాయిరాం వ్యవహరించగా, అవగాహన సీనియర్ సభ్యులు కె.చంద్రశేఖరరావు, ఎ.రవీంద్ర కుమార్, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరస్వామి ఆశీస్సులు కూటమికి మెండుగా ఉండాలి

- జనసేన అధికార ప్రతిధిని ఆళ్ల హరి

విశాలాంధ్ర-గుంటూరు : ప్రజల ఆశీస్సులతో చారిత్రా త్మక విజయాన్ని అందుకొని పరిపాలనా పగ్గాలు చేపడు తున్న కూటమి నేతలకు వెంకటేశ్వస్వామి ఆశీస్సులు మెండుగా ఉండాలని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ళ హరి అన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లుగా సాగుతున్న వైసీపీ రాక్షస పాలనను అంతమొందించి, కూటమి అధికారంలోకి రావాలని, ఎంపీగా పెమ్మసాని, ఎమ్మెల్యేగా గల్లా మాధవి విజయం సాధించాలని మొక్కుకున్న కూటమి నేతలు ఆదివారం ఆ మొక్కుని తీర్చుకున్నారు. రామాలయంటూ గోవిందాలయం పేరుతో సంపత్ నగర్ రామచంద్రాపురం నుంచి పాదయాత్రగా అనంతారం వేంకటేశ్వరస్వామి దేవస్థానం వరకు కూటమి నేతలు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లాడుతూ కూటమి విజయం వెనుక దైవానుగ్రహం కూడా ఉందన్నారు. రాష్ట్ర ప్రజలే కాకుండా దేశ విదేశాల్లోని తెలుగు ప్రజలందరూ రాష్ట్రా నికి పట్టిన వైసీపీ పీడ విరగడవ్వాలని పెద్దఎత్తున పూజలు చేశారన్నారు. పాదయాత్రలో పాల్గొన్న కూటమి నేతలు కొలసాని బాలకృష్ణ తన్నీరు కృష్ణ, వీరయ్య, సాంబశివరావు, నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రత్యేక ప్రార్థనలు చేసినట్లు తెలిపారు. పాదయాత్రలో పెద్ద నాగరాజు, సాంబశివరావు, గల్లా జానకీరామ్, ఆవుల సాంబశివరావు, శ్రీకాంత్, కిషోర్, రామకృష్ణ, గోపి, భవాని, శివారెడ్డి, సుబ్రహ్మణ్యం, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు స్ఫూర్తి రామోజీరావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : తెలుగుజాతి ఉన్నంతకాలం ఈనాడు గ్రూప్ సంస్థల అధినేత చెరుకూరు రామోజీరావు గుర్తుండిపోతారని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో నివాళులర్పించారు. రామోజీరావు వ్యక్తి కాదు..శక్తివంతమైన వ్యవస్థ అని, స్వయం కృషితో కష్టపడి అనేక రంగాల్లో విజయం సాధించారని కొనియాడారు. రామోజీరావు ఒక పోరాట యోధుడని, ఒక ధ్రువతారలా నిరంతరం వెలుగుతూనే ఉంటారని అన్నారు. దేశంలో యువతకు..భావి తరాలకు ఆయన స్ఫూర్తిగా నిలిచారని, కష్టపడితే సాధించలేనిది ఏదీ లేదని నిరూపించిన ఘనుడు రామోజీరావు అని ప్రశంసించారు. పత్రిక, వ్యాపార రంగాల్లో ఎన్నో వినూత్న ఒరవడులు తీసుకొచ్చారని, భౌతికంగా రామోజీరావు దూరమైనప్పటికీ ఆలోచన విధానం, మార్గదర్శనం అందరికీ ఆదర్శప్రాయమని అన్నారు. వార్తలను నిర్మోహమాటంగా..నిర్భయంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయనకు ఆయనే సాటి అని, మీడియా, సినీ పరిశ్రమలకు అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు.

కాపు, బలిజ సంక్షేమ సంఘం సంబరాలు

విశాలాంధ్ర-మంగళగిరి : సార్వత్రిక ఎన్నికలలో జనసేన 21 స్థానా లలో పోటీ చేసి 21, అలాగే రెండు ఎంపీ, స్థానాలలో గెలిచినందుకు మంగళగిరి కాపు బలిజ సంక్షేమ నియోజకవర్గ నాయకులు తిరుమల శెట్టి కొండలరావు గెలిచిన అభ్యర్థులకు అభినందనలు తెలిపారు. ఆదివారం మంగళగిరి కాపు బలిజ సంక్షేమ సంఘం కార్యాలయంలో జనసేన పోటీ చేసిన అన్ని స్థానాలలో గెలుపొందినం దుకు కేక్ కటింగ్ చేసి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రంగశెట్టి రమేష్, చెన్నం శెట్టి నాగరాజు, కాపు బలిజ సంక్షేమ సంఘ నాయకులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

ప్రజా సేవలో నిమఘ్నమైన ఎమ్మెల్యే చదలవాడ

– నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేసిన డాక్టర్ అరవిందబాబు

విశాలాంధ్ర-నరసరావుపేట : ప్రజలకు సేవ చేయడంలో.. ప్రజల కష్ట సుఖాల్లో తోడుగా నిలవడమే తన ధ్యేయమని నరస రావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఈ మేరకు నియో జకవర్గ వ్యాప్తంగా ఆదివారం సుడిగాలి పర్యటన చేపట్టారు. నరసరావుపేట పట్టణంతో పాటు మొలకలూరు, గురు వాయిపాలెం, సుబ్బయ్యపాలెం గ్రామాల్లో పర్యటించారు. నియోజక వర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం మొక్కులు కట్టే స్థాయిలో కార్యకర్తలు పోరాటం చేయడం సంతోషకరం అన్నారు. పార్టీ కోసం పని చేసిన కార్య కర్తలు, నాయకులను కలిసి అభినందించారు. పార్టీ గెలుపు కోసం కృషి చేసిన ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తానన్నారు. ప్రజలకు అండగా నిలవడమే తన తొలి ప్రాధాన్యం అన్నారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం పని చేసిన కార్యకర్తలను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి యాదవ్, కపిలవాయ విజయ్ కుమార్, సుబ్బరాయ గుప్త, పులుకురి జగ్గయ్య, గాడిపర్తి సురేష్, చినప్ప రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామోజీరావుకు నివాళులర్పించిన భాష్యం ప్రవీణ్

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజకీయాన్ని పరిచయం చేసింది దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు అయితే దాన్ని అక్షర రూపంలో మలచి ప్రజలకు చేరవేసింది చెరుకూరు రామోజీరావు అని పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. పెదకూరపాడులోని ఆయన కార్యాలయంలో రామోజీ సంస్థల అధినేత రామోజీరావు చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రవీణ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అభివృద్ధిలో రామోజీరావు కృషి వెలకట్టలేనిదన్నారు. తెలుగు రాష్ట్రాలకు సేవా కార్యక్రమాలను పరిచయం చేసిన ఘనత కూడా రామోజీరావు అని, ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎందరో అభాగ్యులకు అండగా నిలిచిన ఘనుడు రామోజీరావు అని పేర్కొన్నారు. అంతటి మంచి వ్యక్తి మన మధ్య లేకపోవడం చాలా బాధాకరమని, వారి ఆత్మకు శాంతి చేకూ రాలని భగవంతుని ప్రార్థిస్తు న్నట్లు పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ సీనియర్ నాయకులు భాష్యం నరసయ్య, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీయే గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ కృషి ఎనలేనిది : గడిపర్తి శ్రీనివాసరావు



విశాలాంధ్ర-విజయపురి సౌత్ : ఎన్డీయే గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ కృషి మరువలేనిదని ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయ కుడు గడిపర్తి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మాచర్ల మండలం విజయ పురిసౌత్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాచర్ల నియోజక వర్గంలో జూలకంటి బ్రహ్మారెడ్డి గెలుపు కోసం ఎమ్మార్పీఎస్ చేసిన కృషి మరువలేనిదన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ నేతృత్వం లో తెలుగు రాష్ట్రాల్లో ఎన్డీయే కూటమికి మద్దతిచ్చినట్లు చెప్పారు. మాదిగల ఆకాంక్ష మేరకు ఎస్సీ వర్గీకరణను ఎన్డీయే చేపట్టాలన్నారు. ఆయన వెంట సిద్దెల మరియదాసు, ఎల్లెపోగు సైదులు, సిద్దెల ప్రభుదాసు ఉన్నారు.

చత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించిన మాజీ మేయర్ కన్నా నాగరాజు

విశాలాంధ్ర-సత్తెనపల్లి : మహారాష్ట్ర వీధిలో శ్రీ భక్తాంజనేయ స్వామి దేవస్థానం రోడ్డులో చత్రపతి శివాజీ మహారాజు విగ్రహ ఆవిష్కరణ మహోత్సవాన్ని మాజీ మేయర్ కన్నా నాగరాజు ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ విరోజి ఋషింద్రుల వారి మఠం నుంచి కోలాటం మేళ తాళాలతో ఊరేగింపుగా బాజా భజంత్రీలతో బాణ సంచా పురవీధుల్లో నిర్వహించారు. ముఖ్యంగా మహిళలు, పిల్లలు విరివిగా పాల్గొన్నారు. కాషాయ దోష పూజ తుల్జాపూర్ భవాని అమ్మవారి పూజ ను ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న సంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఆర్య క్షత్రియ ఆరే మరాఠ సంఘం నాయకులు, సత్తెనపల్లి పట్టణ ఆర్య క్షత్రియ ఆర్య మరాఠ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పరిపాలనలో నూతన సంస్కరణలకు శ్రీకారం

విశాలాంధ్ర-దుర్గి : బీజేపీ నేత ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలనలో నూతన సంస్కర ణలు తీసుకొచ్చి దేశ ప్రజలకు సుపరిపాలన అందించారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జక్కా సీతారామయ్య అన్నారు. మండల కేంద్రమైన దుర్గి బస్టాండ్ సెంటర్లో ఆదివారం బీజేపీ మండల అధ్యక్షుడు వెలిదండి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ ప్రధానిగా 3వసారి ప్రమాణ స్వీకార మహెూత్సవ కార్యక్రమం నిర్వహించారు. ప్రమాణ స్వీకారం సందర్భంగా ఉమ్మడి కూటమి నాయకులు కేకే కట్ చేసి, నరేంద్ర మోదీకి శుభాకాంక్షలు తెలియజేశారు. మండల అధ్యక్షుడు శ్రీనివాసరావు పుట్టినరోజు కార్యక్రమాన్ని ఉమ్మడి కూటమి సభ్యుల సమక్షంలో జరుపుకున్నారు. అనంతరం పులిహోర పంపిణీ చేశారు. తొలుత గ్రంథాలయం సెంటర్‌లో బీజేపీ పతాకాన్ని ఆవిష్కరి ంచారు. కటకం రాంమోహనరావు, సూరె రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రివర్గంలో డాక్టర్ పెమ్మసాని

– హర్షం వ్యక్తం చేస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లా వాసులు

విశాలాంధ్ర-నరసరావుపేట : ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా గుంటూరు పార్లమెంటు నియోజకవర్గం నుండి మొదటిసారి పోటీ చేసి గెలుపొందిన డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌కు కేంద్ర మంత్రివర్గంలో స్థానం లభించడంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వాసులు హర్షంవ్యక్తం చేస్తున్నారు. తెనాలి మండలం బుర్రిపాలెం గ్రామానికి చెందిన పెమ్మసాని చంద్రశేఖర్ బాల్యం, విద్యాభ్యాసం నరసరావుపేటలో జరిగింది. పెమ్మసాని తండ్రి సాంబయ్య పట్టణంలోని స్టేషన్ రోడ్‌లో మాధురి హోటల్‌ను నిర్వహించేవారు. డాక్టర్ పెమసాని నరసరావుపేటలో మున్సిపల్ హైస్కూల్లో చదువుకుంటూ స్కూలు సెలవు దినాల్లో హోటల్లో తండ్రికి సహాయం చేస్తూ ఉండేవారు. పట్టణంలో మాధురి హోటల్ అంటే తెలియని వారు ఉండరు. చంద్రశేఖర్ మెడిసిన్ చదివి విదేశాలకు వెళ్ళిన అనంతరం మాధురి హోటల్‌ను మూసివేసి ఆ కుటుంబం తెనాలికి వెళ్లిపోయింది. పెమ్మసాని డాక్టర్‌గా విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు గాంచి, మెడిసిన్ చదివే విద్యార్థులకు, ఆసుపత్రులకు సంబంధించిన మెటీరియల్ రూపొందించి ఆన్లైన్ ద్వారా సరఫరా చేయటంలో విశ్వ వ్యాప్తమయ్యారు. గత 2019 సార్వత్రిక ఎన్నికల్లో డాక్టర్ పెమసాని నరసరావుపేట నుండి పార్లమెంటుకు పోటీ చేసేందుకు ప్రయత్నించారు. నాయకులు రాయపాటి పోటీ చేస్తున్నటుతో టీడీపీ అధిష్టానం చంద్రశేఖర్‌కు అవకాశం ఇవ్వలేకపోయింది. ప్రస్తుత ఎన్నికల్లో సైతం ఆయన నరసరావుపేట నుండి పోటీ చేసేందుకు ప్రయత్నించారని సమాచారం. సిట్టింగ్ ఎంపీగా ఉన్న శ్రీకృష్ణదేవరాయలు వైసీపీకి రాజీనామా చేసి టిడిపిలో చేరి నరసరావుపేట నుండి పోటీ చేసేందుకు ఆసక్తి చూపటంతో టిడిపి అధిష్టానం పెమసానికి గుంటూరు సిటీ కేటాయించింది. రాజధాని జిల్లాలో ఉన్న గుంటూరు జిల్లా అభివృద్ధి మంత్రంతో నామినేషన్ వేసి ఎన్నికల ప్రచారానికి బయలుదేరిన డాక్టర్ పెమసాని సమీప ప్రత్యర్థిపై మూడున్నర లక్షల మేర మెజార్టీతో విజయం సాధించారు. మొదటిసారి పోటీ చేసి ప్రజల మన్ననలను పొందిన పెమ్మసాని చంద్రశేఖర్‌కు కూటమి తరపున కేంద్ర మంత్రి పదవి దక్కటంతో అటు పల్నాడు, ఇటు గుంటూరు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వాన స్థితిలో ఆకురాజుపల్లి మేజర్

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : నైరుతి రుతుపవనాల వల్ల వర్షాలు కురుస్తుండటంతో రైతాంగం ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉంది. గత ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నాగార్జున సాగర్ రిజర్వాయర్‌లో తగినంత నీరు చేరని విషయం విధితమే. దీంతో ఎక్కువగా బోర్లు, బావులు, చెరువులు క్రింద మాత్రమే సాగు చేయడం జరిగింది. నాగార్జున సాగర్ కుడి కాలువ ఆయకట్టు కింద ప్రధాన కాలువలైన పిన్నెల్లి మేజరు, ఆకురాజుపల్లి మేజరులకు మరమ్మతులు చేయించక పోవటంతో అధ్వాన స్థితిలో ఉన్నాయి. పిన్నెల్లి మేజరు క్రింద దాచేపల్లి మండలంలోని పలు గ్రామాలు.. అదేవిధంగా మాచవరం మండలం పిడుగురాళ్ల మండలాల్లో వందలాది ఎకరాలకు సాగునీరు, త్రాగునీరు అందుతుంది. ఆకురాజుపల్లి మేజర్ క్రింద పిడుగురాళ్ల మాచవరం వందలాది ఎకరాలకు సాగునీరు మెట్టపైర్లు సాగు చేయుటకు నీరు అందుతుంది. జూలకల్లు బ్రాంచ్ కెనాల్ పరిధిలోని మేజర్ కాలవలకు గత ఏడాది మరమ్మతుకు నోచుకోకపోవడంతో అధ్వాన్న స్థితిలో ఉన్నాయి. కాలువలల్లో పిచ్చి కంప, తుంగ మొలచి కాల్వ మొత్తం మూసుకుపోయి ఉన్నాయి. పిచ్చి కంప మొలవటంతో నీటి ప్రవాహానికి అడ్డుపడి కాలువ కట్టలు తెగే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదైనా గురజాల నియోజకవర్గంలోని కాలువలలో పిచ్చి కంపను, తుంగను తొలగించాల్సిన అవసరం ఉంది. పగిలిపోయిన షట్టర్లు, కొత్త తూములు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు. మేజరు కాలువలపై అక్కడక్కడ పడిన గండ్లను పూడ్చాలని రైతులు కోరుతున్నారు. ఏడాది వర్షాలు ఆశాజనకంగ కురుస్తాయని వాతావరణ శాఖ తెలియచేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాగార్జున సాగర్ జలాశయం నిండే లోపు గురజాల నియోజకవర్గంలోని ప్రధాన మేజర్ కాలువలకు మరమ్మత్తులు నిర్వహించి కాల్వ చివరి భూములకు నీరు అందే విధంగా చూడాలని రైతాంగం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తుంది.

'నీట్'లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం

విశ్వ సాయి జూనియర్ కళాశాలలో ఆల్ ఇండియా నీటిలో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను సన్మానించిన కళాశాల మేనేజ్మెంట్

విశాలాంధ్ర- వినుకొండ: ఈ వారం విడుదలైన 2024 ఆల్ ఇండియా అండర్ గ్రాడ్యుయేట్ నీట్ రిజల్ట్స్ లో విశ్వసాయి విద్యార్థులు పల్నాడు జిల్లా లోనే టాప్ వన్ ర్యాంక్ సాధించడం జరిగింది. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను దానికి కృషిచేసిన అధ్యాపకులను కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించడం జరిగింది. అలాగే కళాశాల తరఫున మెరిట్ సర్టిఫికెట్స్ అందజేయడం జరిగింది. ఆల్ ఇండియా స్థాయిలో కళాశాల పూర్వ విద్యార్థులు బాబీ ఆంటోనీ 620/720, ఎస్కె యాస్మిన్ 513/720 ప్రస్తుతం కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థిని కాకుమాను తేజస్విని 507/720 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్ మరియు పల్నాడు జిల్లా అత్యుత్తమ ర్యాంకుగా నిలవడం జరిగింది. అంతేగాక కళాశాల నుంచి ఐదుగురు విద్యార్థులు పరీక్ష రాయగా ఐదుగురు నీటి పరీక్షలో క్వాలిఫై కావడం జరిగింది అని చెప్పుటకు కళాశాల యాజమాన్యం సంతోషిస్తుంది. ఈ ర్యాంకు సాధించేందుకు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తూ ఈ ర్యాంకు సాధించేందుకు కృషిచేసిన అధ్యాపకులు బయాలజీ అధ్యాపకురాలు శ్రీమతి డి సుహాసిని మరియు ప్రిన్సిపాల్ మరియు కెమిస్ట్రీ ఫ్యాకల్టీ శ్రీమతి శ్రీవల్లి పావని, ఫిజిక్స్ అధ్యాపకులు డాక్టర్ కె.రామారావులను సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమానికి విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఇతర అధ్యాపక బృందం పాల్గొనడం జరిగింది. ఈ విద్యా సంవత్సరం నుంచి విశ్వసాయి జూనియర్ కళాశాల వారి ఆధ్వర్యంలో లాయర్ స్ట్రీట్ నందుగల ముసలారెడ్డి హాస్పిటల్ ఎదురుగా ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా బిల్డింగ్ పైన మహిళా క్యాంపస్ ప్రారంభించడం జరిగింది అని కళాశాల యాజమాన్యం తెలిపారు. లాయర్ స్ట్రీట్ నందు నిర్వహించే ఆరెంజ్ స్టోర్స్ బిల్డింగ్ పై గల విశ్వసాయి జూనియర్ కళాశాల బాయ్స్ క్యాంపస్, గర్ల్స్ క్యాంపస్ నందు కూడా నీట్, ఐఐటి జేఈఈ మెయిన్స్ మరియు ఎంసెట్ క్లాసులు జరుపబడును అని తెలియజేశారు బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి కూడా ఈ కళాశాలలో ఏర్పాటు చేయడం జరిగినది అని తెలియజేయుటకు మేము సంతో షిస్తున్నామని కళాశాల డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస శర్మ, ప్రిన్సిపాల్ శ్రీమతి శ్రీవల్లి పావని తెలిపారు.

జన చైతన్య సమితి నిర్వాహకులు అభినందనలు

– ఎస్సై విప్పర్ల వెంకటరావు

విశాలాంధ్ర-పెదకూరపాడు : ఎటువంటి లాభా పేక్ష లేకుండా సమాజానికి సేవలు అందిస్తున్న జన చైతన్య సమితి నిర్వాహకులు అభినందనీయులని పెదకూరపాడు సబ్ ఇన్స్పెక్టర్ విప్పర్ల వెంకటరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో వెల్ఫేర్ అసిస్టెంట్ యరదేశి వీరస్వామి, కోటప్పకొండ శాలివాహన అన్నదాన సత్రం ఉపాధ్యక్షులు మోదుగుల చంద్రశేఖర్‌ల సహకారంతో వెయ్యి మందికి ఉచిత మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకట్రావు మాట్లాడుతూ మార్చి నెల నుంచి జన చైతన్య సమితి చలివేంద్రం ఏర్పాటు చేసి వేలాది మందికి తాగునీరు అందిస్తున్నారని, తాగునీటితో పాటు దాతల సహకారంతో మజ్జిగ, ద్రాక్ష, నిమ్మరసం, ఆరంజ్ వంటి పానీయాలు ఇస్తూ అందరికి మార్గదర్శకంగా ఉన్నారన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ రాంజీ నాయక్, జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబు, కార్యదర్శి తుళ్లూరి సాంబశివరావు, నిర్వాహకులు కొర్రపాటి వెంకటేశ్వర్లు, వెలితోటి అనిల్ కుమార్, షేక్ లియాకత్ ఆలీ, గుడిపూడి బ్రహ్మనాయుడు, సొంగా జయ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాపయ్య చౌదరిని సన్మానించిన పూర్వ విద్యార్థులు

విశాలాంధ్ర-పెదనందిపాడు : పెదనంది పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థి, ఉత్తర తెలుగు అమెరికా సంఘం(నాట్స్) పూర్వ అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరిని పెదనందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు కొల్లా సీతారామయ్య ఆధ్వర్యంలో ఆదివారం పాఠశాల నందు ఘనంగా సన్మానించారు. నాట్స్ తరుపున ఉభయ తెలుగు రాష్ట్రాలలో విద్య, వైద్యం, ఉపాధి రంగాలలో అందించిన సేవలను గుర్తించి ఢిల్లీలోని నీతి అయోగ్ సంస్థ బాపయ్య చౌదరిని సన్మానించిన సందర్భంగా ఈ సన్మానాన్ని ఏర్పాటు చేశారు. పూర్వ విద్యార్థుల సంఘం తరపున కొల్ల సీతారామయ్య మాట్లాడుతూ పాఠశా లలో భోజనశాల లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతు న్నారని భోజనశాల ఏర్పాటుకు తన వంతు సహకారం అందించాలని బాపయ్య చౌదరిని కోరారు. స్పందించిన బాపయ్య చౌదరి తన సొంత నిధులను 10 లక్షల రూపాయలను కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు లక్ష్మీ దుర్గ మాట్లాడుతూ అడగగానే 10 లక్షలు కేటాయించిన బాపయ్య చౌదరికి పాఠశాల తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. గత గత రెండు సంవత్సరాల నుండి పాఠశాలలో పదవ తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు లక్ష రూపాయలు నగదు బహుమతిని బాపయ్య చౌదరి అందించారని ఆమె తెలిపారు. పాఠశాలలో చదువుకొని ఉన్నత స్థానాలలో ఉన్న పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని ఆమె కోరారు. అనంతరం బాపయ్య చౌదరిని ఘనంగా సన్మానించి సన్మాన పత్రాన్ని అందించారు. సన్మాన గ్రహీత బాపయ్య చౌదరి మాట్లాడుతూ కన్న తల్లి తర్వాత పాఠశాల మనకు మరో కన్నతల్లి లాంటిదని, తల్లి జన్మనిస్తే మన భవిష్యత్తుకు జన్మ నిచ్చేది పాఠశాలని, అటువంటి పాఠశాల అభివృద్ధికి చేయూతనందిం చడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో సామాజిక వేత్త కాపు శ్రీనివాసరావు, తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రం కో-కన్వీనర్ కాకుమాను నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు నూతి శ్రీనివాసరావు, కూనిశెట్టి సుబ్రహ్మణ్యం, విశ్రాంత ఉపాధ్యాయుడు గుగ్గిలం సాయిబాబు పాల్గొన్నారు.

అమరావతి స్కూల్ పై వివాదం

విశాలాంధ్ర - సత్తెనపల్లి : సత్తెనపల్లి పట్టణం ప్రధాన రోడ్డుపై ఉన్న అమరావతి స్కూల్ పై యాజమాన్యం మధ్య వివాద నెలకొని ఇరువర్గాలు ఒకరిపై ఒకరు అభియోగాలు మోపుకొని పాఠశాలలను మూసివేశారు. వివరాల్లోకి వెళితే 2016లో ఎన్నారై మొక్కపాటి చంద్రశేఖర రావు స్థానిక ఆడిటర్ సూర్యదేవర శ్రీనివాస్ రావులు ప్రగతి స్కూల్ యాజమాన్య బాధ్యులు మక్కెన అచ్చయ్యతో కలిసి తాము విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో భవనాలను నిర్మించా మని సూర్యదేవర శ్రీనివాసరావు తెలిపారు దీనిపై తమ మధ్య వివాదాలను సృష్టించి అమరావతి స్కూల్ ను మక్కెన అచ్చయ్య అప్పటి శాసన సభ్యులు అంబటి రాంబాబును అడ్డం పెట్టుకొని పూర్తిగా స్వాధీనం చేసుకున్న రన్నారు. ఈ విషయమై స్థానిక పోలీసులను రెవెన్యూ అధికారులను శాసన సభ్యులను పరిపరి విధాలుగా ప్రాధేయపడిన తమను బయటకు నెట్టారన్నారు దీనిపై న్యాయస్థానాల ఆశ్రయించగా తమకు అనుకూలంగా తీర్పులు వచ్చినప్పటికీ వాటిని ప్రభుత్వ అండతో తొక్కిపెట్టి అమలు చేయలేద న్నారు. అప్పటినుండి ఇప్పటివరకు అనేక సందర్భాలలో అధికారులను తమ పాఠశాలను తమకు అప్పజెప్పాలని కోరుతున్నామన్నారు న్యాయస్థానం పాఠశాల భవనాన్ని పాఠశాల నిర్వహణ బాధ్యతలను సూర్యదేవర శ్రీనివాస రావుకు అప్పజెప్పాలని తహసిల్దార్ కు ఆదేశాలు జారీ చేశారన్నారు అయిన ప్పటికీ అవి అమలకు నోచుకోలేదన్నారు కోట్లాది రూపాయలు వెచ్చించి సత్తెనపల్లి ప్రాంత ప్రజలకు మంచి విద్యను అందించాలని లక్ష్యంతో తాము నిర్మించిన పాఠ శాల భవనాన్ని స్వాధీనం చేసుకోవటమే కాకు ండా మా ఆశయాలను అణిచివేశారని శ్రీనివాసరావు అన్నారు. ఇప్పటివరకు విద్యావ్యవస్థలో ఉండవల సిన విధానాలను అమలు పరచకుండా వైసిపి జెండాలతో ఫ్లెక్సీలతో రాజకీయ కార్యాల యంగా మార్చారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కోర్టు ఉత్తర్వుల ప్రకారం తమ విధులకు ఆటంకాలు కల్పించే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

దేశం పార్టీ రౌడీలు పాఠశాలను ఆక్రమించారు.

దేశం పార్టీ దౌర్జన్యాలతో పాఠశాల భవనాన్ని ఆక్రమించారని ప్రగతి విద్యాసంస్థల డైరెక్టర్ మక్కెన అచ్చయ్య విమర్శించారు ప్రధాని రోడ్ లో ఉన్న అమరావతి పాఠశాలను సూర్యదేవర శ్రీనివాసరావు మరికొందరు తెలుగుదేశం గుండాలు శనివారం రాత్రి పాఠశాల పై దాడి చేసి పాఠశాల బోర్డులను తొలగిం చి తెలుగుదేశం పార్టీ జెండాలను కట్టా రన్నారు. సూర్యదేవర శ్రీనివాసరావు ఎన్నారై చంద్రశేఖర్‌లో సహకారంతో అమరావతి పాఠశాలను ఏర్పాటు చేశా మని అయితే పాఠశాల ప్రాంగణంలోని ఖాళీ ప్రదేశంలో షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మించాలని వాటిని ఆక్రమించాలని వారు ప్రయత్నించారని అన్నారు. ఈ విషయమై యాజమాన్యం మధ్య వివాదాల యెత్తాయని గత కొన్ని సంవత్సరాలుగా తాము పాఠశాల నిర్వహణ బాధ్యతలు చూస్తున్నామని పాఠశాలపై దౌర్జన్యం చేస్తున్న పోలీసులు చూస్తూ ఊరుకుండిపోయారని విమర్శించారు దీనిపై ఫిర్యాదు చేసిన నమోదు చేయటం లేదని అచ్చయ్య పేర్కొన్నారు.

చిన్నారుల మృతి బాధాకరం : సౌమిత్ చౌదరి

విశాలాంధ్ర-పెదకూరపాడు : మండలం పరిధిలోని లింగంగుంట్ల గ్రామంలో చిన్నారులు కుక్కమళ్ల ప్రశంగి, సారెకుక్క ఈశ్వరదేవా దురదృష్టవశాత్తు ఈతకు దిగి మరణించారు. పెదకూరపాడు మండల తెలుగుదేశం పార్టీ యువ నాయకులు లింగంగుంట్ల గ్రామానికి చెందిన మేదరమెట్ల సౌమిత్ చౌదరి చిన్నారుల తల్లిదండ్రులని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపి చిన్నారుల మట్టి ఖర్చులు నిమిత్తం, ఇరువురికి, ఒక్కొక్కరికి రూ.5వేలు చొప్పున ఆర్థిక సహాయం రూ.10 వేలు అందించారు. ఈ సందర్భంగా సౌమిత్ మాట్లాడుతూ చిన్నారుల మృతి చాలా బాధగా ఉందని, ఇలాంటి సంఘటనలు ప్రతి ఒక్క హృద యానికి చాలా బాధగా ఉంటుందన్నారు. ఎవరికి ఇలా జరగకూ డదని విచారం వ్యక్తం చేశారు. మేదరమెట్ల శ్రీనివాసరావు వడ్లమూడి చిన్నా యలమంచిలి శ్రీనివాసరావు గంగినేని చిన్నా యలమంచిలి రమేష్, గంగవరపు బొబ్బిలి జొన్నలగడ్డ వీరయ్య గన్నమనేని మహేష్, లింగం గుంట్ల గ్రామానికి చెందిన తదితరులు చిన్నారుల కుటుంబానికి సానుభూతి తెలియజేశారు.

తుమ్మకోటలో వైఎస్ విగ్రహం ధ్వంసం

విశాలాంధ్ర-రెంటచింతల : మండలంలోని తుమ్మకోటలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని పగల కొట్టారు. తల, చేతులు విరిగిపడ్డాయి. ఘటన తెలియగానే గురజాల డీఎస్పీ శ్రీని వాసరావు, స్థానిక ఎస్సై ఆంజనేయులు తుమ్మకోట వెళ్లి కేసు నమోదు చేసి పరిశీలి స్తున్నట్లు వెల్లడించారు. ఆదివారం ప్రత్యేక దళాలలో తుమ్మకోటలో కవాతు నిర్వహి ంచారు. సమస్యాత్మక గ్రామాలైన రెంటాల, పాలువాయి గేటు, తుమ్మకోట, జెట్టి పాలెంలలో పికెట్ కొనసాగుతున్నట్లు వివరించారు.

అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-దుర్గి : మండల పరిధిలోని నిదానంపాడులో వేంచేసి యున్న ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, మహాశక్తి పీఠం శ్రీనిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి దేవస్థానం వద్దకు ఆదివారం భక్తులు తరలివచ్చారు. భక్తులు కుటుంబ సమేతంగా అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించుకున్నారు. మరికొన్ని రోజుల్లో వేసవి సెలవులు ముగుస్తుం డంతో భక్తులు ఆలయానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు.

నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార మహోత్సవం

విశాలాంధ్ర-వినుకొండ : వినుకొండ శివయ్య స్థూపం నందు భారతీయ జనతా పార్టీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి మేడం రమేష్ ఆధ్వర్యంలో నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార మహోత్సవ సందర్భంగా బాణసంచా టపాసులు కాల్చి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పార్టీ ఎర్రగొండపాలెం ఇన్‌ఛార్జ్ ఎనుముల నాగేశ్వరరావు, వినుకొండ కన్వీనర్ యార్లగడ్డ లెనిన్ కుమార్, బీజేపీ కార్యకర్తలు అనిల్ అప్పలరాజు, దేవతి చిన్న నరసింహారావు, నారిశెట్టి మహేష్, వినుకొండ జనసేన నాయకులు నిశంకర శ్రీనివాసరావు, వేదాల వెంకటేష్, నాయకులు పట్టణ టీడీపీ అధ్యక్షులు పఠాన్ ఆయుబ్ ఖాన్, సుభాష్ చంద్రబోస్ షేక్ బాల 30వ వార్డు అధ్యక్షులు బత్తుల శ్రీనివాసరావు 29వ వార్డు ప్రసాద్ మేడం అశోక్ పాల్గొన్నారు.

నిత్యావసర వితరణ

విశాలాంధ్ర- వినుకొండ : ప్రతి నెలా ఆర్థికంగా వెనుకబడిన బ్రాహ్మణ కుటుంబములను వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆదుకొనే దిశలో భాగంగా ఆదివారం జీవి. మాధవరావు ఆఫీస్ నందు, నిరుపేద బ్రాహ్మణ కుటుంబ ములకు బియ్యం, నూతనవస్త్ర ములు బహుకరణ చేశారు. ఈనెలలో దాతలు అయిన చింత లచెర్వు రాఘవేంద్రరావు, చామర్తి భవాని శంకర్, గొర్తి నాగరాజు, దారారామమూర్తి, జి. మారుతి మహాలక్ష్మి, మౌనిక, ఆర్యవైశ్య ప్రముఖులు అన్నా వీర బ్రహ్మం, నాగమల్లేశ్వరీల సహాయ సహ కారములతో 6 కుటుంబా లకు బియ్యం, నూతన వస్త్ర బహుకరణ జరిగినది. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడుతూ ఎవరికి అయినా వస్తు రూపేణా ధర్మం చేయండి కానీ నగదు రూపేణా ధర్మం చేయకండి అని విజ్ఞప్తి చేసినారు. ఈ కార్యక్రమంనకు ధూళిపాళ్ళ నాగేశ్వరావు, భువనగిరి సుబ్రహ్మణ్యం, ఎస్.ఎస్.వైశాస్త్రి, చింతలపూడి భద్రయ్య, భాగవ తుల.రవి కుమార్, అచ్యుత సుబ్బారావు,అన్నా ప్రగడ వెంకటేశ్వర రావు, ఎం. వి. శర్మ తదితరులు హాజరయ్యారు.

పార్కు బోర్డు ధ్వంసం

విశాలాంధ్ర-విజయవాడ (క్రైం): విజయవాడ 42వ డివిజన్‌లో పార్కు బోర్డును టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేశారు. ఈ ఘటన విజయవాడ భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. క్రాంబే రోడ్డులోని వైఎస్సార్ పార్కు బోర్డును ధ్వంసం చేశారు. బోర్డు పై ఉన్న వైఎస్సార్ పేరును తొలగించారు. సమాచారం అందుకున్న భవానీపురం పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు.